క్లుప్తంగా

ఆత్మీయంగా..ఆప్యాయంగా..!



పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతిరూరల్: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సోమవారం కలిశారు. దివంగత నేత వైఎస్‌ఆర్ వర్ధంతి నిమిత్తం ఇడుపులపాయకు వచ్చిన అధినేతను హర్షిత్‌రెడ్డి కలవడంతో ఆయన ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం కుట్రలతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి జైలులో ఉంచడంతో ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. అక్రమ కేసులు ఎంతో కాలం నిలబడవని, మంచి రోజులు వస్తాయని హర్షిత్‌రెడ్డికి అధినేత ధైర్యం చెప్పారు.

చీర్ల కిరణ్‌కు 'తెలుగు తేజం' పురస్కారం



చీర్ల కిరణ్‌ను పురస్కారంతో సత్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు చీర్ల కిరణ్‌కు తెలుగు తేజం పురస్కారం వరించింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవ సంస్థకు చెందిన శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు పురస్కారం ప్రదానం చేసి సన్మానించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఐకేఎస్‌పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సుకు హాజరైన వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ నాలెడ్జ్ సిస్టం పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యవక్తగా ప్రొఫెసర్ లజపతిరాయ్, వాల్మీకి రీసెర్చ్ సెంటర్ రామాయణం కేంద్ర డైరెక్టర్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టంపై అవగాహన కల్పించారు. వాల్మీకి రామాయణం ద్వారా నైతిక న్యాయశాస్త్రం ఏ విధంగా అన్వేషించాలి? వాల్మీకి రామాయణం న్యాయం, ధర్మం, సమానత్వం, పాలనా వంటి రాజ్యాంగ ఆదర్శాలకు సమాంతరంగా ఎలా కలిగి ఉందో, ఆ విషయాలను రామాయణం ఏ విధంగా పొందుపరిచారో తెలియజేశారు. సమావేశంలో వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు

క్వాంటమ్ టెక్నాలజీ వైపు సన్నద్ధులుకండి



సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (అనంతపురం) సౌజన్యంతో ×ఇంట్రడక్షన్ టు క్వాంటమ్ టెక్నాలజీస్-అప్లికేషన్స్ అనే అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఐఐఎస్ఆర్ డాక్టర్ త్రసేన్ జెనా మాట్లాడారు. ప్రస్తుతం అంతా క్వాంటమ్ టెక్నాలజీ మీదే నడుస్తోందని, దీనికి అనుగుణంగా విద్యార్థులు సమాయత్తమవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ మన్నెం అరవింద్‌రెడ్డి, డాక్టర్ మునిశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు,

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్: తిరుపతిలో ఎక్కువ మద్యం సేవించి వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా, అలాగే మరో 8మందికి సైతం రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి మందుబాబులను కోర్టుకు హాజరు పరిచారు.

న్యాయవాది మృతికి సంతాపం

తిరుపతి లీగల్: సీనియర్ న్యాయవాది సి.మాధవరెడ్డి మృతికి న్యాయమూర్తులు, న్యాయవాదులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక కోర్టు ఆవరణలోని 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో సంతాప సభ నిర్వహించారు. మాధవరెడ్డి సేవలను 4వ అదనపు జిల్లా జడ్జి అర్చన, తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు గజేంద్ర, పలువురు న్యాయవాదులు ప్రస్తుతించారు. సమావేశంలో తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, పదవ అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, రాష్ట్ర ఎర్రచందనం విచారణ కేసుల సెషన్స్ జడ్జి నరసింహమూర్తి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శైలజ, సీనియర్ సివిల్ జడ్జిలు పార్థసారథి రాజు, సునీత రాణి, జూనియర్ జడ్జిలు గ్రంధి శ్రీనివాస్, కోటేశ్వరరావు, సత్యకాంత్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏ టైం అవుతుందో: తిరుపతిలోని రేషన్ షాపుల వద్ద నిత్యావసర సరుకుల కోసం క్యూలలో పడిగాపులు కాస్తున్న మహిళలు , ఇంటికి రాణిని..ఇక్కడ కూలీని: ఎట్లయితే అట్లగానీ ఇంటికాడికి ఇట్లే మోసుకుపోతా..







ఏం కష్టాలయ్యా బాబూ : స్మార్ట్ కార్డుల కోసం వేచిఉన్న మహిళలు

రేషన్ కష్టాలు చూడర బాబూ..!

టైం సెన్స్ లేదబ్బా: పది గంటలవుతున్నా రేషన్‌షాపు తెరవకపోవడంతో పడిగాపులు కాస్తున్న మహిళలు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రశాంతంగా ఇంటి వద్దనే రేషన్ తీసుకునే వాళ్లం..ఇప్పుడు రేషన్ షాపుల వద్ద గంటల కొద్దీ క్యూలలో పడిగాపులు కాయాల్సి వస్తోందని కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారులు మండి పడుతున్నారు. పనులన్నీ మానుకుని ఎండనక, వాననక కాళ్లు పడిపోయేలా క్యూలలో నిలబడాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనికితోడు తోడు రేషన్ కార్డుల స్థానంలో కొత్త స్మార్ట్ కార్డులను ఇళ్లకు తెచ్చి ఇవ్వకపోవడంతో రేషన్ షాపుల వద్ద వాటి కోసం సైతం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి మహిళలకు చిర్రెత్తిస్తోంది. తిరుపతిలో కనిపిస్తున్న దృశ్యాలివి. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగినుల నిరసన

తిరుపతి తుడా: రుయా హాస్పిటల్ వద్ద సోమవారం సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగినులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏపీసీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాధమ్మ సంఘీభావం తెలిపారు. రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి మాట్లాడారు. 20 ఏళ్లుగా రాష్ట్రంలో 4 లక్షల మంది ఉద్యోగులు పెన్షన్ భద్రత లేకుండానే సర్వీసు కొనసాగిస్తున్నారని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వ సామాజిక పెన్షన్‌కు సమానమైన పెన్షన్ కూడా సీపీఎస్ ఉద్యోగులు అందుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని పోరాటం చేస్తుంటే మరింత నష్టం కలిగించేలా ప్రభుత్వాలు జీవోలు తెస్తున్నాయని, పోరాటం చేస్తున్న ఉద్యోగులపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. సెప్టెంబర్ 1ని విద్రోహ దినంగా ఎంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు పూనుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ మహిళా నాయకురాలు భువనేశ్వరి, ఏపీ జీఎస్‌ఏ జిల్లా నాయకులు సారా సుభాషిణి, వరలక్ష్మి, కృష్ణ పద్మ, చంద్రావతి, ×హంస× జిల్లా కార్యదర్శి టాటాబాయ్, పలు యూనియన్ల నేతలు, సీనియర్ నర్సింగ్ సిబ్బంది విజయమ్మ ,శైల, శాంతీబాయి పాల్గొన్నారు .



రుయా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకురాళ్లు

'ఆపరేషన్ స్వర్ణ'తో స్వర్ణముఖి నది ప్రక్షాళన

తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి తుడా: ఆపరేషన్ స్వర్ణ పేరిట స్వర్ణముఖి నదిని ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్టు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నదికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు, కబ్జాలను తొలగించనున్నామని, ఇందుకోసం హైడ్రా తరహాలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. నది బఫర్ జోన్‌లో స్థలాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. నదిలో ఇళ్లు కట్టడం వల్ల రెండేళ్ల క్రితం స్వర్ణముఖి నది వరద మూలాన తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఆక్రమణదారులు ఏ స్థాయి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అక్రమ కట్టడాల బాధ్యతను సీఎం చంద్రబాబు తుడాకు అప్పగిస్తూ జీఓ జారీ చేశారన్నారు. తనకు, చంద్రగిరి ఎమ్మెల్యే నానికి మధ్య ఎలాంటి విబేధాలు లేవని, తామంతా కలిసే పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇక, శెట్టిపల్లె భూములకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. తుడా చరిత్రలో ఎన్నడు లేనివిధంగా దాదాపు 850 మంది పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీఓలకు తుడా లేఔట్స్, అప్రూవల్ బిల్డింగ్స్ అనుమతులపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు.



ఆపరేషన్ స్వర్ణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం లక్ష్మీపురం సర్కిల్లోని ఓ హోటల్లో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా బండి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శిగా చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారిగా వి.పురుషోత్తమ నాయుడు, అలాగే లియో క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా భయ్యా బ్రహ్మయ్య, కార్యదర్శిగా ఎస్.నాగ నితన్ కుమార్, కోశాధికారిగా టి.పునీత్ ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ప్రిసైడింగ్ అధికారి లయన్ మక్కిన భాస్కర్, ముఖ్య అతిథులుగా కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులు, గీతం విద్యాసంస్థల అధినేత టి.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ టీవీఎస్ఆర్‌కేవీ.ప్రసాద్, ఇండక్షన్ ఆఫీసర్‌గా డాక్టర్ కల్లూరి రాజారెడ్డి వ్యవహరించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, రామచంద్రారెడ్డి, చిట్టిబాబు, సోమయ్య, ముబారక్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, శంకర్, రామారావు, సభ్యులు పాల్గొన్నారు.



మధుసూదన్‌రెడ్డి , చక్రపాణి

ఘనంగా 'మన పాఠశాల-మన ఆత్మగౌరవం'

తిరుపతి సిటీ: అఖిల భారతీయ రాష్ట్రీయ షైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ్ (ఏపీయూఎస్) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్‌లో మన పాఠశాల-మన ఆత్మ గౌరవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవీ.రామిరెడ్డి మాట్లాడుతూ, వ్యక్తిత్వ నిర్మాణం, క్రమశిక్షణ, సమయపాలన, సామాజిక స్పృహ.. ఇత్యాది వాటికి పాఠశాల విద్య నుంచే పునాది వేసి బాధ్యత గల పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉమ్మడి కుటుంబ వ్యవస్థను గౌరవించాలని, పౌరవిధులను నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని షకీనా, దాదాపు 700 మంది విద్యార్థులు, 40 మంది అధ్యాపకులు, ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, ఇంజినీరింగ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఏబీఆర్ఎస్ నాయకులు

మహాసభతోనే దళితుల్లో చైతన్యం



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి గుర్రప్ప

తిరుపతి కల్చరల్: నాటి దళిత మహాసభ ఉద్యమ స్ఫూర్తితో అంబేడ్కర్ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుని గ్రామ గ్రామాన ప్రజల్ని చైతన్యవంతుల య్యారని ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఆవిర్భవించి 40 ఏళ్లు అవుతున్న తరుణంలో సోమవారం సాయంత్రం అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. అంజయ్యతోపాటు రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప మాట్లాడారు. 1985 జూలై 17న కారంచేడులో అగ్రకులస్తులు ఆరుగురు దళితులను కిరాతకంగా హత్య చేశారని, దీనిపై చలో చీరాల పేరిట నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమం నేపథ్యంగా ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ప్రస్థానాన్ని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటైన శాఖలు, చేసిన పోరాటాల గురించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. కార్యక్రమంలో దళిత సంఘ నేతలు చెంగల్‌రాయులు, ఎం.నాగరాజు, డాక్టర్ మునిరత్నం, ప్రభాకర్, ధనశేఖర్, గొడుగుచింత గోవిందయ్య, రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలపై ఆలయ కమిటీ సభ్యులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోమవారం సమీక్షించారు. ఈనెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని, భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆలయ సిబ్బంది, గ్రామపెద్దలను కోరారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు చేసే అలంకరణలో తక్కువ చేయరాదని, గ్రామంతో పాటు ఆలయ పరిసరాలు ముస్తాబు చేసే విషయంలో ఎక్కడా లోపం లేకుండా చూడాలన్నారు. తిరుమల తరహాలో నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని స్థానిక పోలీసుల సహాయం కూడా తీసుకోవాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకునేలా ఉండాలన్నారు. సమీక్షలో ఆలయ ఈవో సుబ్బరామిరెడ్డి, ఇతర సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత

-మహిళావర్సిటీ వీసీ ఉమ

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతీ మహిళా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా చేరిన 2025-2029 బ్యాచ్ విద్యార్థినులకు సోమవారం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని బేసిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగం నిర్వహించింది. వీసీ ఆచార్య వి.ఉమ ప్రారంభించి మాట్లాడారు. సాంకేతిక విద్య ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుందని, శ్రద్ధతో ఒక లక్ష్యం నిర్దేశించుకుని చదివితే అద్భుత విజయాలు అందుకోగలరని దిశా నిర్దేశం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య రజిని మాట్లాడుతూ,త క్రమశిక్షణతో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తే సాఫ్ట్‌వేర్ రంగంలో దూసుకుపోగలరన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రామజ్యోతి, వెల్ఫేర్ డీన్ కె.ఉషారాణి, ఐక్వాక్ డైరెక్టర్ త్రిపుర సుందరి, పరీక్షల విభాగం డీన్ ఆచార్య కె.అనురాధ, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో ఓరియెంటేషన్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్న మహిళావర్సిటీ అధికారులు

టీడీఆర్ బాండ్ల స్థలాలను పరిశీలించిన కమిషనర్

తిరుపతి తుడా: టీడీఆర్ బాండ్లు మంజూరు చేయనున్న స్థలాలను క్షేత్రస్థాయిలో సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలసి పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో ఎనిమిది మంది కోల్పోయిన స్థలాలు, వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. లీలామహల్ కూడలి, జబ్బార్ లేఔట్, ఉపాధ్యాయ నగర్, చింతలచేను వద్ద వంద అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు, సత్యనారాయణపురం స్థలాలను, అలాగే రెండు భవనాల నిర్మాణ అనుమతులను, ప్లాన్ పరిశీలించారు. కార్యక్రమంలో డీసీపీ ఖాన్, ఏసీపీ మూర్తి, టీపీఎస్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు 26 వినతులు

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికు 26 వినతులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. వాటిని పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, రెవెన్యూ ఆఫీసర్లు సేతు మాధవ్, ఏసీపీలు మూర్తి, మధు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

అప్పలాయగుంటలో పెద్దజీయర్ స్వామి



పసన్నుడి ఆలయంలో పెద్దజీయర్

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామిని సోమవారం తిరుమల జీయర్ మఠానికి చెందిన పెద్ద జీయర్ స్వామి దర్శించుకొన్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు ఆలయ చరిత్ర, ఆపాదమస్తకం ఆభరణాల వివరాలను తెలియజేసి, హారతులిచ్చారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బాక్సింగ్ పంచ్ అదుర్స్!

– సత్తా చాటిన క్రీడాకారులకు అభినందన

చంద్రగిరి: ఇటీవల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో తిరుచానూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థినులు తమ పంచ్ సత్తా చాటారు. గత నెల 23 నుంచి 25వ తేది వరకు తిరుపతిలో ఈ పోటీలు నిర్వహించారు. తిరుచానూరు విద్యార్థినులు దేవిశ్రీ, సాగరిక, లక్ష్మి, రాజేశ్వరి, జలజాక్షి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకోవడంతోపాటు గత నెల 29న విశాఖలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం విజేతలను జిల్లా బాక్సింగ్ కోచ్ సురేంద్ర బాబుతో పాటు టీచర్లు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న టీచర్లు